ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

వికారాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి) : వికారాబాద్ జిల్లాలో పని చేస్తున్న ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. ధారూరు సీఐ రామకృష్ణ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశంలను ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించారు. డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా అంజనేయులు, ధారూరు సీఐగా భీంకుమార్‌లను నియమించారు.

కాశన్నగుంట చెరువు శిఖంలో నిర్మించిన పరిశ్రమ



చెరువు శిఖం హాంఫట్!

చెరువు శిఖాలను రియల్ వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు చెరబడుతున్నారు. పారిశ్రామిక వాడలుగా గుర్తింపు పొందిన షాద్‌నగర్, కొత్తూరు, నందిగామ మండలాల్లో పలు చెరువుల శిఖాలను యథేచ్ఛగా కబ్జా చేశారు. పలు చోట్ల పరిశ్రమలను ఏర్పాటు చేయగా.. మరికొన్ని చోట్ల రియల్ వ్యాపారులు వెంచర్లు వేసి ప్లాట్లను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చివరికి పాటు కాలువలను సైతం వదలకుండా మాయం చేశారు. దీంతో చెరువులు నిండితే తమ ఇళ్లల్లోకి వరద వస్తుందని చుట్టుపక్కల కాలనీల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

చెరువును పూడ్చిన మున్సిపల్ చైర్మన్‌పై కేసు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఘట్‌కేసర్, సెప్టెంబరు 4: పోచారం మున్సిపాలిటీ, అన్నోజిగూడలోని మీరాలం కుంటను పూడ్చిన మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డిపై ఇరిగేషన్ ఏఈ పరమేశ్ పోచారం ఐటీ కారిడార్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో బుధవారం ప్రచురితమైన '4 చెరువులు మాయం' అనే కథనానికి అధికారులు స్పందించారు. ఏఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టిన పోలీసులు పోచారం మున్సిపల్ చైర్మన్‌పై కేసు నమోదు చేశారు.

యథేచ్ఛగా పరిశ్రమలు, వెంచర్ల ఏర్పాటు

- రైతుల పొట్టకొడుతున్న పరిశ్రమల యజమానులు
- పాటు కాలువలను సైతం వదలని రియల్టర్లు
- సమీప కాలనీల్లోకి చేరుతున్న వరద నీరు
- కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్ మండలాల్లో కుచించుకుపోయిన చెరువులు, కుంటలు
- పట్టించుకోని రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానిక ప్రజలు



తీగాపూర్‌లోని బొద్దికుంట శిఖంలో నిర్మించిన పరిశ్రమ

కబ్జాల పర్వం 6

షాద్‌నగర్/కొత్తూరు, నందిగామ సెప్టెంబరు 4: చెరువు శిఖం భూముల్లో పేదలు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. అలాంటి భూములపైనా పరిశ్రమల యజమానులు, రియల్టర్ల కన్ను పడింది. ఇంకేముంది అనేక చెరువుల శిఖాలు నేడు కనుమరుగైపోయాయి. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో ఆయా పేదవర్గాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా షాద్‌నగర్ నియోజకవర్గంలోని చెరువులకు రక్షణ కరువైంది. దీంతో సేద్యానికి భరోసా లేకుండా పోయింది. చెరువులు, కుంటలు, పాటు కాలువల ఆక్రమణలకు గురికావడంతో భారీ వర్షాలకు కాలనీలన్నీ చెరువులను తలపిస్తున్నాయి.

నిబంధనలు తుంగలో తొక్కి

షాద్‌నగర్ హెచ్‌ఎండీఏ పరిధిలోని ఫరూఖ్‌నగర్ మండలంలో 34, కొత్తూరు మండలంలో 33, నందిగామ మండలంలో 33 చొప్పున చెరువులు, కుంటలున్నాయి. కొత్తూరు మండలం శివారు గ్రామాల్లోని చెరువులు, కుంటలను కబ్జా చేసి పదుల సంఖ్యలో పరిశ్రమలను ఏర్పాటు చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న భూముల్లో కొంతమంది రైతులకు పట్టాదారుపాస్ పుస్తకాలున్నాయి. ఆయా భూములను విక్రయించరాదని, కేవలం వాటిని సాగు కోసమే వాడుకోవాలన్న నిబంధనలు ఉన్నాయి. కానీ కొంతమంది ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతూ చెరువు స్థలాలను కొనుగోలు చేసి పరిశ్రమలను నెలకొల్పారు. వారితో పాటు రియల్ వ్యాపారులు కూడా పాటు కాలువలు, శిఖం భూములను కబ్జా చేసి అందులో వెంచర్లు ఏర్పాటు చేశారు. పారిశ్రామికవాడగా ఎంతో పేరు గాంచిన కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్ మండలాల్లో కూడా చెరువులు, కుంటలను ఆక్రమించి పరిశ్రమలను నెలకొల్పారు.

కొత్తూరులో బొద్దుకుంట చెరువు మాయం

కొత్తూరు మండలం తీగాపూర్ గ్రామ శివారులో 9 ఎకరాల్లో విస్తరించి ఉన్న బొద్దుకుంట చెరువు సమీపంలో ఒక పరిశ్రమను నెలకొల్పారు. ఈ చెరువులో సుమారు 2 ఎకరాల శిఖం భూమిని ఆక్రమించి పరిశ్రమ నెలకొల్పారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనివల్ల చెరువులోని జలాలు కలుషితమయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని సుమారు 30 ఎకరాల్లో కాశన్న గుంట చెరువు విస్తరించి ఉంది. ఇందులో కూడా సుమారు 2 ఎకరాల భూమిని ఆక్రమించుకుని పరిశ్రమ నెలకొల్పారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికి తోడు ఆ పరిశ్రమ చుట్టూ ప్రహరీ నిర్మించారు.

ఫరూఖ్‌నగర్‌లో చెరువు చుట్టూ ప్రహరీ నిర్మాణం

ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ శివారులోని లాడెం చెరువుతో పాటు కాలువకు అడ్డంగా ప్రీకాస్ట్ వాల్ నిర్మించారు. అదే మండల పరిధిలోని వీరమోని చెరువు పాటు కాలువకు అడ్డంగా ఒక వ్యక్తి ప్రహరీ నిర్మించారు. దీనివల్ల చెరువులోని నీరు నిండి పంట పొలాల్లోకి ప్రవహిస్తోంది. ఇంత పెద్ద ఎత్తున శిఖం భూములు ఆక్రమణలకు గురవుతున్నా ఇరిగేషన్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఆక్రమణలకు గురైన శిఖం భూములను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నందిగామలో పీర్లకుంట చెరువు ధ్వంసం

నందిగామ మండలం రంగాపూర్ గ్రామంలో చెరువులోకి వెళ్లే కాలువను రియల్ వ్యాపారులు కబ్జా చేసి రోడ్డు నిర్మాణం చేపట్టారు. అదే మండల పరిధిలోని పీర్లకుంట చెరువు కట్టను ధ్వంసం చేసి రోడ్డును ఏర్పాటు చేశారు. దీనివల్ల చెరువులో ఉన్న నీరు కాలువ గుండా బయటకు వెళ్లడానికి వీలు లేకపోవడంతో నీరంతా పక్కనే ఉన్న పంట పొలాల్లోకి వచ్చి చేరుతోంది. ఇటీవల నందిగామ మండల పరిధిలో ఒక ప్రజాప్రతినిధి కాలువపై నిర్మించిన ప్రీకాస్ట్ వాల్‌ను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు.



పీర్లకుంట చెరువు కట్టను ధ్వంసం చేసి నిర్మించిన రోడ్డు

శిఖం భూములను కాపాడాలి



శిఖం భూములను కాపాడాలి. భావితరాలకు సాగు, తాగు నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకే శిఖం భూములకు మార్కింగ్ చేసి గుర్తించాలి. వాటిని రైతులు సాగు చేసుకోవాల్సిందే తప్ప అమ్మడానికి వీలులేదు. ఈ విషయాలు తెలిసినా కొందరు బడా నేతలు, వ్యాపారస్తులు ఆ భూములను కొనుగోలు చేస్తున్నారు. ఈ విషయంపై ముందుగా నాయకులే కళ్లు తెరవాలి. అధికారులు కూడా ఒత్తిళ్లకు తలొగ్గి నిర్మాణాలకు అనుమంతించకూడదు.

- బక్కని నర్సింహులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు



మహిళా రైతుకు చెక్కు, ఇంటి స్థలం పట్టా అందిస్తున్న అధికారులు, నాయకులు

అభివృద్ధికి సహకరించడం
అభినందనీయం

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

కొడంగల్, సెప్టెంబరు 4: సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనులకు రైతులు సహకరించడం అభినందనీయమని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. కొడంగల్ మండలంలోని అప్పాయిపల్లి గ్రామ శివారులో సర్వే నెం.19లో ఏర్పాటు చేయనున్న మెడికల్, వైద్య కళాశాలల నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు బుధవారం కడా కార్యాలయంలో కలెక్టర్, తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి తదితరులు పరిహారం కింద చెక్కులు, ఇంటి స్థలాల పట్టాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు తమ భూములను స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అప్పగించడం హర్షనీయమన్నారు. భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల స్థలాలకు లే అవుట్లను రూపొందించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రాధాన్యం కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తాండూర్ ఆర్డీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎన్.ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఒడిసి పట్టాలి

బొంరాస్‌పేట్: వర్షపు నీటినిఒడిసి పట్టి భూగర్భ జలాలు పెంచేందుకు వాల్ కట్టలు, పాంపండ్స్ నిర్మించుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం ఆయన బీఆర్ఎల్ఎఫ్ ఎన్‌జీవో ప్రతినిధులు రితీష్, భరద్వాజ్‌తో కలిసి నాగిరెడ్డిపల్లి, కొత్తూర్ గ్రామాలరైతులతో నాగిరెడ్డిపల్లిలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరమేశ్వరుడిగుట్టపై నుంచి వచ్చే వరద నీరు, జలధారలను భూమిలో ఇంకే విధంగా పాంపండ్స్, కట్టల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకన్నగౌడ్, ఎంపీవో మహేశ్‌కుమార్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి గణపతులనే పూజించాలి



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు రూపొందించిన వాల్ పోస్టర్‌ను కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ గౌతమ్ ఆవిష్కరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మట్టి గణపతులనే పూజించాలన్నారు. కార్యక్రమంలో బి.రాజేందర్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

- మేడ్చల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)





వడిచర్ల సత్యం | నిమ్మ నరేశ్,

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా
సత్యం, నరేశ్

- నేడు సీఎం చేతుల మీదుగా పురస్కారాలు ప్రదానం

వికారాబాద్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/పెద్దేముల్, సెప్టెంబరు 4: వికారాబాద్ జిల్లాలో పని చేస్తున్న ఇద్దరు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. నవాబ్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ జూనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎన్.నరేష్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల విద్యాశాఖకు సంబంధించి పెద్దేముల్ మండలం, కందనెల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)గా పనిచేస్తున్న కె.సత్యం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన 2002లో ఉపాధ్యాయ వృత్తి చేపట్టి మండల, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను సైతం అందుకున్నారు. సత్యం కవితలు, పద్యాలు రచిస్తూ మంచిపేరును సంపాదించుకుంటున్నారు. మణిపూసల సృష్టికర్తగా కవితలు రాయడంలో కొత్తవరవడిని సృష్టించారు. అవార్డులు బాధ్యతను మరింత పెంచాయని, ఈ పురస్కారం రావడం సంతోషంగా ఉందని సత్యం చెప్పారు. ఈ ఇద్దరూ గురువారం హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి వారికి అవార్డులు అందజేయనున్నారు.

దంచికొట్టిన వాన

తెల్లారేసరికి నిండిన చెరువులు, కుంటలు

మత్తడి దుంకిన చెరువులు

- అతలాకుతలమైన మైసమ్మగూడ
- నీట మునిగిన అరుంధతి, వైభవ్‌కాలనీలు
- ఇళ్లలోకి చేరిన వరదనీరు



చెరువును తలపిస్తున్న వెంకటాపూర్‌లోని అరుంధతి కాలనీ

ఘట్‌కేసర్//ఘట్‌కేసర్ రూరల్/మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 4: ఘట్‌కేసర్‌లో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో చెరువులు, కుంటలు మత్తడి దూకాయి. వాగులు వంకలు ఉధృతంగా ప్రవహించాయి. ఇప్పటి వరకు అరకొరవర్షాలతో చెరువులు కుంటల్లోకి సగం మేరకే నీరు చేరింది. మంగళవారం రాత్రి 11 గంటలకు ప్రారంభమైన వర్షం తీవ్రరూపం దాల్చింది. ఉరుములు మెరుపులతో దాదాపు రెండు గంటల పాటు కురిసిన భారీ వర్షంతో చెరువులు కుంటలు నిండి అలుగులు పారాయి. పలు చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొండాపూర్, ఎన్ఎఫ్‌సీనగర్ కాలనీల్లో పలు ఇళ్లల్లోకి వరద నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఘట్‌కేసర్ ఎన్ఎఫ్‌సీనగర్‌ల మధ్య రాయికుంట చెరువు, చెటేరుకుంటలు నిండి అలుగు పారాయి. ఎగువప్రాంతమైన కుషాయిగూడ, కీసర, నాగారం, దమ్మాయిగూడ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా ఎరిమల్లె వాగు, బొంతకుంటవాగులు ఉధృతంగా ప్రవహించాయి. ఘట్‌కేసర్‌లోని బైపాస్ రోడ్డులో ఎరిమల్లె వాగు సర్వీసురోడ్ల పైనుండి ప్రవహించింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వానలకు ఘట్‌కేసర్ మండలంలోని వెంకటాపూర్ అరుంధతి, వైభవ్‌కాలనీల్లో వరద నీరు ఇళ్లలోకి వచ్చి చేరింది. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంపీడీవో గీతారెడ్డి, ఇరిగేషన్ ఏఈ పరమేష్, ఆర్ఐ కావ్య నాడెం చెరువు పరిసరాలను పరిశీలించారు. అరుంధతి, వైభవ్ కాలనీని సందర్శించి స్థానికులతో మాట్లాడి సమస్య తలెత్తకుండా చేస్తామని తెలిపారు. వరద నీరు నాడెం చెరువులోకి వెళ్లే విధంగా జేసీబీతో సీసీరోడ్డుకు గండి కొట్టారు. కార్యక్రమంలో కార్యదర్శి శశికుమార్, మాజీ సర్పంచ్ ఉదారి వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ నీరుడి రామారావు, పాల్గొన్నారు.

కూలిన ఇంటి గోడ

కొడంగల్ రూరల్: కొడంగల్ మండల పరిధిలోని చిట్లపల్లి గ్రామంలో మోసిన్ కుటుంబీకులతో రాత్రి ఇంట్లో నిద్ర పోయాడు. కురిసిన వానకు ఇంటి గోడలు పడిపోయాయి. గోడ కూలి బయటి వైపు పడింది. అదే లోపలి వైపు పడితే నలుగురు ప్రాణాలు పోయేవని బాధితుడు ఆవేదనవ్యక్తం చేశాడు.

మైసమ్మగూడ జలమయం

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ మరోసారి జలమయమైంది. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వీధులు వరదనీటితో నిండిపోయాయి. ఫలితంగా విద్యార్థులు రాత్రి వేళ హాస్టళ్లకు వెళ్లటానికి నానాఇబ్బందులు పడ్డారు. కొన్ని హాస్టళ్ల సెల్లార్లలో నీరు చేరడంతో విద్యార్థులు బయటికి రాని పరిస్థితి ఏర్పడింది. చెరువు కాలువలు కబ్జా చేయడంతో వరద నీరంతా కాలువల గుండా వెళ్లాల్సింది పోయి వీధుల్లోకి రావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. వర్షం కురిసినప్పుడల్లా మైసమ్మగూడకు వరద ముప్పుతప్పడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.



మైసమ్మగూడలోని హాస్టళ్లలోకి చేరిన వరదనీరు



బొక్కోనిగూడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న ఎరిమల్లేవాగు



తాగునీటి సమస్య తీర్చాలని ఎండీకి వినతి

ఘట్‌కేసర్, సెప్టెంబరు 4: పోచారం మున్సిపాలిటీ పరిధి యంనంపేట్ ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, నారపల్లి, పోచారంలో తాగునీటి ఇబ్బందులను తీర్చాలని బుధవారం పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, కౌన్సిలర్లు వాటర్‌వర్క్స్ ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ట్యాంకులు నిర్మించినా నీటి సరఫరా చేయడం లేదన్నారు. పైపులైన్ వేయాల్సి ఉందన్నారు. నారపల్లికి ఎప్పుడో ఓసారి నీటిని సరఫరా చేసి బిల్లును మాత్రం మొత్తానికి ఇస్తున్నారని చెప్పారు. దీన్ని పరిశీలించి నీటి బిల్లును రద్దుచేయాలని కోరారు. ఎండీని కలిసిన వారిలో కౌన్సిలర్లు, మహేష్, రాజశేఖర్, నాయకుడు కాశయ్య తదితరులు ఉన్నారు.


ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

మహిళలు ఆర్థికంగా రాణిస్తేనే గుర్తింపు


మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ పావని

ఘట్‌కేసర్, సెప్టెంబరు 4 : మహిళలు ఆర్థికంగా రాణిస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. బుధవారం కొండాపూర్‌లో మెప్మా సహకారంతో ఏర్పాటు చేసిన ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించారు. వ్యాపారంలో రాణించాలంటే ఓపికగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మాధవరెడ్డి, కమిషనర్ సాబెర్ అలీ, కౌన్సిలర్లు హేమలత, వెంకటర్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

నాపరాతి గనుల్లో భారీగా చేరిన వర్షపు నీరు

బషీరాబాద్, సెప్టెంబరు 4: చుట్టూ నాపరాళ్ల గుట్టలు, మధ్యలో చిన్నపాటి మడుగు.. ఇదంతా చూస్తుంటే ఏదో పర్యాటక కేంద్రం అనుకుంటే పొరపాటే. మూడు రోజులు కురిసిన వర్షాలకు నాపరాళ్ల గనుల్లోకి భారీగా నీరొచ్చింది. నవాల్గ, మాసన్‌పల్లి, కొర్విచెడ్, జీవన్గి, క్యాద్గిరా, ఎక్మాయి గ్రామాల పరిధి నాపరాళ్ల గనుల్లో తవ్వకాలు నిలిచిపోయాయి. గనులు కుంటలను తలపిస్తున్నాయి. వందలాది కార్మికులు పని కోల్పోయారు.


మాసన్‌పల్లిలో నీటితో నిండిన నాపరాతి గని

మట్టి గణపతులను పూజించాలి

వికారాబాద్, సెప్టెంబరు 4 : జిల్లాలోని కుమ్మరి కులవృత్తుల వారిని ప్రోత్సహించేందుకు, పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులనే పూజించాలని జిల్లా బీసీవెల్ఫేర్ అధికారి ఉపేందర్ తెలిపారు. కులవృత్తుల వారికి ప్రభుత్వం శిక్షణిచ్చించిందన్నారు. కుమ్మరుల వద్ద మట్టి గణపతులు కొనాలని తెలిపారు. మట్టి గణపతులు కావాల్సిన వారు వికారాబాద్ కుమ్మరి అంజిలయ్య ఫోన్ నంబర్ 9966466982, పరిగి/గౌరీశంకర్ 9676038986, తాండూరు/శ్రీశైలం 9640518846, కొడంగల్/అంజిలయ్య 9391645200లను సంప్రదించాలన్నారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

వికారాబాద్, సెప్టెంబరు 4: ప్రభుత్వ ప్రైవేట్, ఎయిడెడ్ కాలేజీల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్టీ వెల్ఫేర్ అధికారి కమలాకర్‌రెడ్డి తెలిపారు. 2024-25కు ఫ్రెష్, రెన్యువల్ పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం డిసెంబరు 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు 8639388553 అనే నంబరులో సంప్రదించాలన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే వేటు

శామీర్‌పేట, సెప్టెంబర్ 4 : కళాశాలలో ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ హెచ్చరించారు. బుధవారం ఎస్పీఆర్ జూనియర్, డిగ్రీ కళాశాల్లో యాంటీ ర్యాగింగ్, మాదకద్రవ్యాల నివారణపై అవగాహన నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ తోటి విద్యార్థులపై ర్యాగింగ్ పాల్పడటం నేరం అన్నారు. ర్యాగింగ్ నిషేదం అన్నారు. ఎవరైనా ర్యాగింగ్ పాల్పడితే బాధిత విద్యార్థులు వెంటనే కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీకిగానీ, యాజమాన్యానికిగానీ, పోలీసులకు గానీ తెలపాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద క్రిమినల్ వేటు వేస్తామని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తులో ఎలాంటి ఉద్యోగానికి అర్హులు కారని, కళాశాల నుంచి వారిని తొలగిస్తారని హెచ్చరించారు. విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, సమాజానికి పేరుతెచ్చే పౌరులుగా ఎదగాలని పోలీసు అధికారి చెప్పారు. కార్యక్రమంలో శామీర్‌పేట ఎస్సైలు, ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్

ఆసుపత్రుల్లో కుక్కకాటు, పాము కాటుకు అందుబాటులో వ్యాక్సిన్

● జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పాల్వన్‌కుమార్

వికారాబాద్, సెప్టెంబరు 4: కుక్కకాటు, పాము కాటు, తేలు కాటుకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో వ్యాక్సిన్ అందుబాటులో ఉందని జిల్లా వైద్యాధికారి పాల్వన్‌కుమార్ బుధవారం తెలిపారు. అవసరమైన వారికి వ్యాక్సిన్ ఉచితంగా అందజేస్తామని, ఈ వ్యాక్సిన్ గురించి ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలన్నారు. విషకీటక కాటుకు గురైతే మూఢ నమ్మకాలు, మంత్రాలతో వ్యాక్సిన్ వేసుకోకుండా ఉండొద్దని సూచించారు. బీపీ, షుగర్ వ్యాధులకు కూడా మందులు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా అందచేస్తామన్నారు.

మెడికల్ ఆఫీసర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

వికారాబాద్, సెప్టెంబరు 4 : జిల్లాలో ఖాళీగా ఉన్న 12 మెడికల్ ఆఫీసర్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేస్తామని డీఎంహెచ్‌వో పాల్వన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10:30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇంటర్వ్యూలు చేసి భర్తీ చేస్తామన్నారు. అర్హత గల అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో పేర్కొన్న సమయంలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

ఆలయ భూమిని పరిరక్షించండి

కీసర, సెప్టెంబరు 4 : ఆలయ భూమిని పరిరక్షించాలని కీసర గ్రామస్తులు ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయానికి అనుకొని ఉన్న భూమిని కొందరు కబ్జా చేసి ప్రహరీనిర్మించారని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. సర్వే చేసి ఆలయ భూమిని కాపాడాలని గ్రామస్థులు ఎంపీని కోరారు. ఎంపీని కలిసిన వారిలో నల్లా వెంకట్‌రెడ్డి, జూపల్లి అశోక్, చంద్రమౌళి పాల్గొన్నారు.


ఎంపీ రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కీసర గ్రామస్థులు

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలి

కీసర, సెప్టెంబరు 4 : ప్రభుత్వ భూమిలో నిర్మానాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అంకిరెడ్డిపల్లి గ్రామస్థులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబరు 918, 917, 886, 887లలో సాల్వో ఎక్స్‌ప్లోసివ్ పరిశ్రమ వారు అక్రమంగా ప్రహరీ నిర్మిస్తున్నారని తెలిపారు. వారు అక్రమ మైనింగ్ చేస్తుండటంతో గ్రామంలో తమ ఇళ్లు కూలుతున్నాయని గ్రామస్థులు అధికారులకు తెలిపారు. అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, బాల్‌రాజ్, రమేష్, మహేష్ బలరాం తదితరులు పాల్గొన్నారు.

పంటలు పాడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

వికారాబాద్, సెప్టెంబర్ 4: కురుస్తున్న అధిక వర్షాలకు పంటలు పాడవకుండా ఉండేందుకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తాండూరు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ టి. లక్ష్మణ్, శాస్త్రవేత యమున బుధవారం తెలిపారు. ఆదివారం అధిక వర్షాలతో వరి, మొక్కజొన్న, పత్తి చేలల్లో నీరు నిలిచిందన్నారు. నీరు బయటికి పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కీసరగుట్ట హుండీ ఆదాయం రూ.20.6లక్షలు


కీసర, సెప్టెంబర్4: కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం 20.6 లక్షలు వచ్చిందని రంగారెడ్డి జిల్లా ఎండోమెంట్ సహాయ కమిషనర్ శేఖర్ తెలిపారు. బుధవారం ఐదు నెలల హుండీ లెక్కించారు. ఆలయ ఆదాయాన్ని బ్యాంక్ ఖాతాలో జమ చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ తటాకం నాగలింగం శర్మ, ఈవో సుధాకర్, భక్తులు పాల్గొన్నారు.


హుండీని లెక్కిస్తున్న భక్తులు

చెంచుల సమస్యల పరిష్కారానికి కృషి

● గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కమలాకర్‌రెడ్డి

కులకచర్ల, సెప్టెంబరు 4: చెంచు కుటుంబాల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేస్తోందని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి కమలాకర్‌రెడ్డి తెలిపారు. ప్రధాని జన్మాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలోగల చెంచు కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు లేని వారికి ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇతర సదుపాయాలు కల్పించేందుకు కృషిచేస్తామని అధికారి ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం బాలవరలక్ష్మి, చెంచులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.







వికారాబాద్ జిల్లాలో 39 మంది ఉత్తమ ఉపాధ్యాయులు

నేడు అసెంబ్లీ స్పీకర్ చేతుల మీదుగా సన్మానం

వికారాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో 39 మంది ఉపాధ్యాయులను ఉత్తములుగా ఎంపిక చేశారు. 49మంది దరఖాస్తు చేసుకోగా 39 మందిని ఎంపిక చేశారు. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో గంగుల రవీందర్‌రెడ్డి(చౌదర్‌పల్లి), కె.రాంచంద్రయ్య, డి.హన్మంత్‌రెడ్డి(చన్‌గోముల్), కృష్ణకుమార్(సిరిగిరిపేట్), కెతావత్ తౌర్యా, బి.బుచ్చయ్య(పరిగి), జి.విద్యావతి(చెంగోల్), బి.కరుణాకర్, ఆర్.హన్మంతు(హకీంపేట్), సి.ఉమేష్(రాంపూర్), ఎం.మంజుల(కులకచర్ల), కె.సంపత్‌కుమార్(కొంశెట్‌పల్లి), కె.సంగీత(మంబాపూర్), బి.శ్రీనివాస్(మిట్టకోడూర్), సి.బుచ్చిరెడ్డి, ఫాతిమాబేగం(కోట్‌పల్లి), భీమ్యానాయక్ (కిష్టాపూర్), పి.విజయలక్ష్మి(పెద్దేముల్), కె.విజయ్‌ఆనంద్(ఇందూర్), జె.సుధాకర్ (కొడంగల్)లను ఎంపికయ్యారు. పీజీటీ విభాగంలో బి.కొండయ్య(టీజీఎంఎస్ బంట్వారం), టి.మాధవి(టీజీఎంఎస్ పూడూరు), ఎల్‌ఎఫ్ ఎల్ హెచ్ఎం విభాగంలో మొగులయ్య(అగ్గనూర్) ఎంపికయ్యారు. ఎస్టీటీ విభాగంలో వి.సుజాత(మన్నేగూడ), బి.కృష్ణయ్య(గుండాల్), కె.వాణి(మైలారం-దోమ), బి.ఆంజనేయులు(నాగసాన్‌పల్లి), విస్లావత్ పాండ్యా(సాల్వీడ్), వి.దేవ్లా(హన్మానాయక్ తండా), కె.రమేష్(సిరిపురం), కె.ప్రభాకర్‌రెడ్డి(సుల్తాన్‌పూర్), నసీమున్నీసా(సర్పన్‌పల్లి), బి.రాధిక(కోట్‌బాస్‌పల్లి), ఎం.నాగరాణి(పులుమద్ది), శేరి వీరప్ప(మోమిన్‌కుర్దు), డి.రవి(కొత్లాపూర్), ఎం.రాఘవేందర్‌రెడ్డి(మైల్వార్), ఎం.మురహరి(అగ్గనూర్), ఎ.క్రిష్ణవేణి(కేజీబీవీ యాలాల్) ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేటి(గురువారం) ఉదయం 10:30గంటలకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగే కార్యక్రమానికి అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి ఆయన జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. కార్యక్రమానికి కలెక్టర్, ఎమ్మెల్యేలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

కలెక్టరేట్‌లో 'వార్తల్యాప్' వర్క్‌షాప్



సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్


మేడ్చల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్‌లో బుధవారం పత్రిక సమాచారంపై వార్తల్యాప్ మీడియా వర్క్‌షాప్ ఎను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు చేసే ప్రతీ కార్యక్రమాన్ని ప్రజలకు తెలిసేలా చూడాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తోన్న ప్రజాసంక్షేమ పథకాలు పేదలకు చేరేలా చూడాల్సి బాధ్యత అధికారులదేనని, ఆ సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరాయా? లేదా? అని నిర్ధారించుకుని వార్తలు రాయాల్సిన బాధ్యత మాత్రం పాత్రికేయులదేనన్నారు. కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ పీఐబీ(వార్తల్యాప్) మీడియా వర్క్ షాప్ ఏ విధంగా పనిచేస్తుంది? మీడియాకు సమాచారం ఎలా ఇవ్వాలి? ఎన్ని భాషల్లో సమాచారాన్ని పత్రికలకు, మీడియాకు చేరవేయాలి? అనే అంశాలపై వివరించారు. ప్రతీ జర్నలిస్ట్ ఈ వార్తల్యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఐబీ లాంటి కేంద్ర ప్రభుత్వ కార్యాలయం నేడు మన మధ్యకు వచ్చి జిల్లా స్థాయిలో వర్క్‌షాప్‌లను నిర్వహిస్తోందని ఇందుకు పీఐబీ బృందాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ సమాచార కార్యాలయం ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తోందని, కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి కచ్చిత సమాచారాన్ని ప్రజలకు, మీడియాకు చేరవేయడంలో పత్రికా సమాచార కార్యాలయం ముఖ్య భూమిక పోషిస్తోందని తెలంగాణ రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతిపాటిల్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాధవరం కృష్ణారావు, లక్ష్మారెడ్డి, వివేకానంద, డీఆర్ పీఐబీ సంపత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతన్న ఎస్పీ కె.నారాయణరెడ్డి


గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

పరిగి/తాండూరు, సెప్టెంబరు 4: గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా ఎస్పీ కె.నారాయణరెడ్డి అన్నారు. బుధవారం పరిగిలోని గ్రీన్‌పార్కు హోటల్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఉత్సవాలను హిందూ, ముస్లింలు సోదర భావంతో నిర్వహించుకోవాలన్నారు. మండపాల వివరాలను పోలీసు స్టేషన్‌లతో తప్పక నమోదు చేయించుకోవాలని సూచించారు. మండపాలు, ఉత్సవాల్లో ఏమైనా ఇబ్బందికర సంఘటనలు జరిగితే మండపాల నిర్వాహకులే బాధ్యత వహించాలన్నారు. లౌడ్‌స్పీకర్లు, డీజేలకు అనుమతి తప్పనిసరన్నారు. రాత్రి పదిలోపు పూజలు, ఇతర కార్యక్రమాలన్నీ ముగించాలని సూచించారు. మద్యం సేవించికానీ, అనుమతి లేని కార్యక్రమాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్, డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ ఎన్.శ్రీనివాస్, ఎస్‌ఐ ఎం.సంతోష్, కమిషనర్ వెంకటయ్య, విద్యుత్ ఏఈ ఖాజా, మాజీ ఎంపీపీ అరవిందర్‌రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ సురేందర్, డీసీసీ ప్రధానకార్యదర్శి కె.హన్మంత్, నాయకులు ఇ.కృష్ణ, బి.ప్రవీణ్‌రెడ్డి, వి.పెంటయ్య, ఎం.నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. అపోహలు, అసత్య ప్రచారాన్ని నమ్మకుండా గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి కోరారు. తాండూరు గ్రాండ్ హోటల్‌లో జరిగిన శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఆకతాయిల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మతసామరస్యానికి తాండూరును ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్వప్న, తహసీల్దార్ తారాసింగ్, సీఐలు, నాయకులు రాజుగౌడ్, నర్సింలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీడీపీవో మహిరున్నీసా బేగం

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కులకచర్ల, సెప్టెంబరు 4: పౌష్టికాహారంతోనే మనిషికి సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం అని పరిగి సీడీపీవో మహిరున్నీసాబేగం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీలో పోషణమాసం సందర్భంగా సమావేశం నిర్వహించారు. పిల్లలు, బాలింతలు, గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ బాధ్యతతో మెలగాలని తెలిపారు. రెగ్యులర్‌గా పిల్లలు ఎత్తు, బరువు పరిశీలించాలని సూచించారు. వైద్య సిబ్బంది అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పరీక్షలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ యాదమ్మ, హెచ్ఎం శ్రీనివాస్, హెల్త్‌అసిస్టెంట్ వెంకట్, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, లలిత, అనసూయ, గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.


ప్రీస్కూల్ సామగ్రిని అందజేస్తున్న సూపర్‌వైజర్ రాణి

అంగన్‌వాడీ కేంద్రాలకు సామగ్రి అందజేత

తాండూరు రూరల్, సెప్టెంబరు 4: ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీ స్కూల్ విద్యను బోధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి అన్నారు. బుధవారం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద గ్రామాల అంగన్‌వాడీలకు ప్రీ స్కూల్ విద్యకు సంబంధించిన సామగ్రిని టీచర్లకు అందజేశారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. తాండూరు ఐసీడీఎస్ పరిధిలో 279అంగన్‌వాడీ కేంద్రాలకు మొదటి విడత 45 కేంద్రాలను ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. అంగన్‌వాడీలకు పెయింటింగ్‌తో పాటు నేమ్ బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రీస్కూల్ విద్య ఉద్దేశ్యం చిన్నారులకు ఆట, పాటల రూపంలో అక్షరాలను నేర్పించడం అని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఆపరేటర్ ప్రసాద్, టీచర్లు పాల్గొన్నారు.

పథకాల లక్ష్యాల పూర్తికి సహకరించాలి

ఆమనగల్లు, సెప్టెంబరు 4: ప్రభుత్వ పథకాల లక్ష్యాల పూర్తికి ప్రజలంతా సహకరించాలని ఎంపీడీవో కుసుమ మాధురి కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున కార్యదర్శులు పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మేడిగడ్డ, శంకర్‌కొండ, సామాయిపల్లి, దయ్యాల బోడు, కేశ్యతండాలలో బుధవారం ఎంపీడీవో పర్యటించారు. నర్సరీలు, పల్లె ప్రకృతివనాలు, పారిశుధ్య కార్యక్రమాలు, తాగునీటి పథకాలను పరిశీలించారు. శంకర్‌కొండ తండా పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల కింద మంజూరైన రూ.50 వేలతో చేపట్టే పనుల గూర్చి టీచర్లకు సూచనలు చేశారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి


కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 4: ప్రజలకిచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడడం లేదని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రైతు రుణమాఫీ విషయంలో ఎవరూ అధైర్యపడొద్దని అర్హులైన ప్రతీ రైతుకు మాఫీ అవుతుందన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి 359 మంది లబ్ధిదారులకు రూ.3.74 కోట్ల కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే 113 మందికి రూ.28.66 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ధరణి పోర్టల్‌తో గత ప్రభుత్వం చేసిన తప్పిదాలతో అనేక మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కార్యాచరణతో ముందుకు పోతుందన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేదల భూములు లాక్కొని అనేక ఇబ్బందులపాలు చేసిందని, కాంగ్రెస్‌ది రైతు ప్రభుత్వమని, ఏదైనా రైతులకు న్యాయం చేకూరుస్తుందన్నారు. ఫోర్త్‌సిటీతో ఈ ప్రాంత రూపురేఖలు మారనున్నాయన్నారు. ఆర్డీవో కె.అనంతరెడ్డి, ఆదిభట్ల, ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్లు నిరంజన్‌రెడ్డి, స్రవంతి, ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం తహసీల్దార్లు సునీతారెడ్డి, ప్రసాద్‌రావు, అయ్యప్ప, ఉప్పరిగూడ ప్యాక్స్ చైర్మన్ ఏదుల్ల పాండు రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు మరింత ఆర్థికంగా ఎదగాలి

సెర్ప్ సీఈవో దివ్య


కేశంపేట: మహిళా సమాఖ్యా సభ్యులతో మాట్లాడుతున్న దివ్య

కొత్తూర్, సెప్టెంబరు 4: మహిళలు మరింత ఆర్థికంగా ఎదగాలని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో మట్టి పాత్రల తయారీ యూనిట్‌ను బుధవారం సీఈవో పరిశీలించి, మహిళ సంఘాల సభ్యులతో ముచ్చటించారు. మట్టి పాత్రల తయారీ విధానం, మార్కెటింగ్ తదితర అంశాలను సీఈవో దివ్య సభ్యులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో పేరుగాంచిన దర్గాగా గుర్తింపు ఉన్న జేపీ దర్గా ఇన్ముల్‌నర్వకు సమీపంలో ఉండడంతో దర్గాలో మట్టి పాత్రల విక్రయం అధికంగా ఉంటుందని సభ్యులు పేర్కొన్నారు. వివిధ ఆకృతుల్లో మట్టి పాత్రలు తయారు చేసి విక్రయిస్తామని చెప్పగా.. సీఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీఎం కొండయ్య, సీపీలు రాజప్ప, ఎండీ ఖలీల్, ఎన్.లక్ష్మమ్మ, కె.అలివేలు, వీఏవోలు, గ్రామసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

కేశంపేట : బ్యాంకు రుణాలను వినియోగించుకొని మహిళా సంఘాలు అభివృద్ధి చెందాలని సెర్ప్ సీఈవో దివ్య సూచించారు. మండలంలోని తులవానిగడ్డ మహిళా సంఘం సభ్యులతో సమావేశమ్యారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను ఎలా తిరిగి చెల్లిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. రుణాలతో హోటళ్లు పెట్టి, వచ్చిన డబ్బుతో తిరిగి చెల్లిస్తున్నామని సభ్యులు తెలిపారు. కేశంపేట మానసిన వికలాంగుల పునరావాస కేంద్రాన్ని పరిశీలించి.. దివ్యాంగుల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కేంద్రానికి ఆటో సౌకర్యం కల్పించాలని కోరారు. కేశంపేట మహిళా సమాఖ్యా సభ్యులతో సమావేశమయ్యారు. భూతల్లి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ పనితీరు అడిగి తెలుసుకున్నారు. కేశంపేట పునరావాస కేంద్రానికి అన్ని సౌకర్యాలు కల్పించాలని కేశంపేట మాజీ సర్పంచ్ తలసాని వెంకట్‌రెడ్డి కోరారు. అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌డీవో శ్రీలత, కేశంపేట ఎంపీడీవో రవిచంద్ర కుమార్‌రెడ్డి, ప్రాజెక్ట్ మెనేజర్లు రవీందర్, మైత్రేయి, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

విద్య, వైద్య సదుపాయాల్లో సర్కార్ విఫలం

మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి


మహేశ్వరం ఆసుపత్రిలో సమస్యలపై డాక్టర్‌ను వివరాలు అడిగి తెలుసుకుంటున్న సబితారెడ్డి

మహేశ్వరం, సెప్టెంబరు 4 : విద్య, వైద్య సదుపాయాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క సంక్షేమ పథకం కూడా సరిగ్గా అమలు చేయడంలేదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మండిపడ్డారు. బుధవారం మహేశ్వరంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పాఠశాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలకు విద్య, వైద్యం ప్రధానమని, ఈ రెండింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ప్రధానంగా రైతు రుణమాఫీ ఒకటని, దానిని అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. సీఎం రుణమాఫీ రూ.31 వేల కోట్లు అని ప్రచారం చేసుకుంటున్నారని, భట్టి విక్రమార్క మాత్రం రూ.7 వేల కోట్లు మాఫీ చేశామని చెప్పడం సిగ్గుచేటన్నారు. గ్రామపంచాయితీ వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని, కార్మికులకు కనీస వేతనం చెల్లించలేని స్థితిలో ప్రభుత్వం ఉండడం బాధాకరమన్నారు. అభివృద్ధిని పక్కకు పెట్టి హైడ్రాను తెరపైకి తెచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకేనా ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టిందని ప్రశ్నించారు. ఇప్పుడు కొత్తగా రేషన్, హెల్త్‌కార్డుల కోసం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తామని సీఎం చెప్పడం సిగ్గుచేటన్నారు. ఎంపీడీవో శైలజారెడ్డి, ఆర్‌ఐ స్వర్ణకుమారి, బీఆర్‌ఎస్ నాయకులు పాండుయాదవ్, డి.వెంకటేశ్వర్‌రెడ్డి, నవీన్, ప్రభాకర్‌రెడ్డి, సుధీర్ గౌడ్, దయ్యాల శ్రీనివాస్, సమీర్, రాజేష్, కె. ప్రభాకర్, పి.బాలయ్య, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

నీవు లేకున్నా.. నీ కళ్లు ప్రపంచాన్ని చూడాలి

ఓ తండ్రి కోరిక.. ప్రమాదంలో గాయపడి

చికిత్స పొందుతూ మరణించిన కుమారుడి కళ్లు దానం


ప్రశాంత్ యాదవ్ (ఫైల్)

నందిగామ, సెప్టెంబరు 4: చిన్నతనంలోనే లోకం విడిచిపోయిన తన కుమారుడి కళ్లు ఇంకొన్నాళ్లు ఈ ప్రపంచాన్ని చూడాలని ఓ తండ్రి కోరుకున్నాడు. ప్రమాదంలో మరణించిన తన కుమారుడి కళ్లను దానం చేసి దాతృత్వం చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే నందిగామ మండలం మేకగూడకు చెందిన ప్రశాంత్‌యాదవ్(26) కారు డ్రైవింగ్ చేస్తూ హైదరాబాద్‌లో ఉండేవాడు. ఈనెల 1న స్వగ్రామం మేకగూడకు వచ్చాడు. 3వ తేదీన మేకగూడ నుంచి కొత్తూరు మండలం ఇన్ముల్ నర్వకు ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి వస్తుండగా అదుపుతప్పి కిందపడిపోయాడు. ప్రశాంత్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించారు. కోమాల్లోకి వెళ్లిన ప్రశాంత్ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. తన కుమారుడి మరణం తీరని లోటని, అయినా తన కళ్లు ఈ ప్రపంచాన్ని చూడాలని భావించిన తండ్రి ఆంజనేయులు ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి సమాచారం ఇచ్చి కళ్లు దానంచేసి గొప్ప మనస్సు చాటుకున్నాడు. కాగా, ప్రశాంత్ మృతితో మేకగూడలో విషాదచాయలు అలుముకున్నాయి.


శంకర్‌పల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

ప్రజలకు ఇబ్బందులు కలగనీయొద్దు

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో పర్యటన

చేవెళ్ల, సెప్టెంబరు 4 : వానల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు కలగనీయకుండా సమస్యలు పరిష్కరించాలని, వర్షాలు పడినప్పుడే ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి పనులు బయటపడుతాయని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం శంకర్‌పల్లి మున్సిపాల్ పరిధిలోని ఫత్తేపూర్ బ్రిడ్జి పక్కన గల రోడ్డును, రావులపల్లి గ్రామంలోకి వెళ్లే రోడ్డును పరిశీలించారు. అలాగే మోకిలలోని లా పాలామాలోని విల్లాస్‌లను పరిశీలించి వివిధ శాఖల అధికారులతో మాట్లాడారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను బాగు చేసేందుకుగాను కృషి చేస్తామన్నారు. మున్సిపాలిటీ పరిధిలో నిర్మాణంలో ఉన్న రోడ్డు పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లా పాలామాలోని విల్లాస్ వద్ద వరద ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా అధికారులు శాశ్వత పరిష్కారం దిశగా ముందుకెళ్లాలని సూచించారు. ప్రజలకు వ్యాధులు సోకకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ నాయకులు

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 4: శంషాబాద్ మండలంలోని పాల్మాకుల గ్రామానికి చెందిన కో-ఆపరేటివ్ చైర్మన్, డైరెక్టర్లు, కేంద్ర మాజీ ప్రొసెసింగ్ యూనిట్ డైరెక్టర్, లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ మీడియా అధ్యక్షుడు, మాజీ సర్పంచ్, ఎంపీటీలను, వార్డు సభ్యులు, ఆయకట్టు సంఘం చైర్మన్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈమేరకు బుధవారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ సమక్షంలో వారు పార్టీలో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నీళ్ల శ్రీధర్‌గౌడ్, చంద్రారెడ్డి, నీరటి రాజు ముదిరాజ్, జూకల్ శ్రీనివాస్‌రెడ్డి, సత్యానంద్ తదితరులు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయంపై మంచాలలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో అన్నదాతలకు సూచనలిస్తున్న శ్రీకృష్ణ

సమీకృత వ్యవసాయ విధానం లాభసాటి

శాస్త్రవేత్తలు శ్రీకృష్ణ, సుధీర్

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ

మంచాల, సెప్టెంబరు 4 : సమీకృత వ్యవసాయ విధానాలు రైతులకు లాభసాటిగా ఉంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు డా.శ్రీకృష్ణ, డా.సుధీర్‌లు సూచించారు. ప్రకృతి వ్యవసాయంపై మంచాలలో బుధవారం రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణలో భాగంగా అన్నదాతలకు అంతర పంటలు, పోషకాలు, మిశ్రమ పంటలు, మల్చింగ్, పంటలను వైవిధ్యపరచడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ జీవామృతం, బీజామృతం, దశపర్ణి కషాయం, నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అగ్నిహస్త్రం వంటి సంప్రదాయ పద్ధతులతో పంటలను చీడపీడల నుంచి సంరక్షించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ అధికారి కిషన్‌రావు, నవీన, మంచాల ఏఈవో సాయిసిరి, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఎం.కృష్ణ, చెన్నయ్య, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన గుడ్లనే వాడాలి


ఊట్లపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లను తనిఖీ చేస్తున్న పద్మజారమణి

కందుకూరు, సెప్టెంబరు 4 : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతోపాటు బాలింతలకు, గర్భిణీలకు బలవర్ధకమైన ఆహారం అందించాలని, నాణ్యమైన గుడ్లను మాత్రమే వాడాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ మోతీ, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి పద్మజారమణిలు అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లను ఆదేశించారు. బుధవారం మండలంలోని ఊట్లపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని వారు తనిఖీ చేశారు. కేంద్రానికి నాణ్యమైన గుడ్లు సరఫరా చేస్తున్నారా? లేదా? అనే విషయమై ఆరా తీశారు. గుడ్లను పగుల కొట్టి నాణ్యతను పరిశీలించారు. ప్రీస్కూల్ తల్లులతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు. ట్రే గుడ్లు 1500 గ్రాముల కంటే ఎక్కువ బరువు ఉంటేనే తీసుకోవాలని, లేనిచో వాపస్ చేయాలని అంగన్‌వాడీ టీచర్‌ను ఆదేశించారు. తక్కువ సైజ్‌లో గుడ్లు ఉంటే తీసుకోరాదన్నారు. నాసిరకం గుడ్లు పంపిణీ చేస్తే తగిన చర్యలుంటాయని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. ప్రీస్కూల్ పిల్లల హాజరుశాతం పెంచాలని టీచర్‌ను ఆదేశించారు. అనంతరం కందుకూరు చౌరస్తాలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారితో సీడీపీవో శాంతిశ్రీ తదితరులున్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి


ఆలయంలో పూజలు చేస్తున్న బాల్‌రెడ్డి

తాండూరు రూరల్, సెప్టెంబరు 4: ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తానని తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి అన్నారు. చెంగోల్‌లోని ప్రసన్నాంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు హన్మయ్య ఆధ్వర్యంలో శ్రావణ మాస ముగింపు పూజలు నిర్వహించారు. బాల్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని అన్నదానంలో పాల్గొన్నారు. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్‌ఐ పవన్, కానిస్టేబుళ్లు పూజల్లో పాల్గొన్నారు.కార్యక్రమంలో నాయకులు భాస్కర్‌రెడ్డి, తులసీరాం, హన్మయ్య, వెంకటేశం, రాముయాదవ్, నారాయణరెడ్డి, జయంత్, నర్సింహులు, గుర్రంపల్లి రాందాస్, హర్షవర్ధన్‌రెడ్డి, హరీశ్వర్‌రెడ్డి, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు. అనంతరం వారిని మాజీ ఎంపీటీసీ రాములు సత్కరించారు.

పెద్ద చెరువు కల్వర్టును పరిశీలించిన అధికారులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 4: విరిగిన మేడ్చల్ పెద్ద చెరువు వాగు వంతెనను జాయింట్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఆర్డీవో ఉపేందర్‌రెడ్డిలు బుధవారం పరిశీలించారు. వంతెనకు తక్షణమే మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించేందుకు చేట్టాల్సిన చర్యలపై చర్చించారు. జాతీయ రహదారుల అధికారులు మరమ్మతులు చేపట్టేందుకు ముందుకు రావటంతో పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. వినాయక నిమజ్జనానికి వచ్చే వాహనాలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. వంతెన పనులు పూర్తయ్యే వరకు మున్సిపల్ అధికారులు, హైడ్రా అథారిటీ అధికారులకు సహకరించాలని ఆదేశించారు. తాత్కాలిక పనులతో సరిపెట్టకుండా వంతెన సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్, ఏఈ నిఖిత, ఏసీపీ వెంకరెడ్డి, ట్రాఫిక్ పోలీస్ సీఐ హనుమాన్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి, కౌన్సిలర్లు ఉమనాగరాజు, మహేష్, తుడుం గణేష్, నాయకులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్‌యాదవ్, నాగరాజు, తదితరులు అధికారులు పాల్గొన్నారు.

పొలాల్లో నీటి నిల్వను తొలగించాలి


బషీరాబాద్: పర్వత్‌పల్లి శివారులో పత్తి పంటను పరిశీలించి సూచనలు చేస్తున్న ఏఈవో రాజ్‌కుమార్

బషీరాబాద్, సెప్టెంబరు 4: మూడు రోజులు కురిసిన భారీ వర్షాలకు పొలాల్లో చేరిన నీటిని తొలగించాలని నీళ్లపల్లి ఏఈవో రాజ్‌కుమార్ రైతులకు సూచించారు. బుధవారం ఇస్మాయిల్‌పూర్, నీళ్లపల్లి, జలాల్‌పూర్, పర్వత్‌పల్లి, మర్పల్లి, మైల్వార్ గ్రామాల్లో పత్తి, కంది, వరి పొలాలను పరిశీలించారు. పొలాల్లో నీటి తొలగింపు, సస్యరక్షణ చర్యలపై రైతులకు వివరించారు. క్లస్టర్ పరిధిలో పెద్దగా పంటలకు నష్టం వాటిల్లలేదని, లోతట్టు ప్రాంత పొలాల్లో అత్యధికంగా నీరు నిలిచిందన్నారు. అయితే కొంత మేర కంది, పత్తికి నష్టం జరిగిందని ఏఈవో తెలిపారు.

ధారూరు: కొండాపూర్ కలాన్‌లో దెబ్బతిన్న పంటలను వికారాబాద్ ఏడీఏ స్వరూప పరిశీలించారు. వర్షాలకు పాడైన పత్తి, కంది, పంటలను ఆమె పరిశీలించి మాట్లాడారు. పంట వివరాలను ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. పొలాల్లో నిల్వ ఉన్న నీటిని కాలువలతో తీసివేయాలని సూచించారు. పంటలకు వేరుకుళ్లు సోకితే కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును మొక్కల మొదళ్ల వద్ద వే సుకోవాలని, నీట మునిగిన మొక్కలకు వెంటనే 19:19:19 లేదా యూరియా లీటరు నీటికి 10గ్రా ముల చొప్పున కలిపి వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలన్నారు. ఏడీఏ వెంట ఏఈవో మంజుల, మాజీ సర్పంచ్ పరమేశ్, రైతులు ఉన్నారు.

కొడంగల్: పత్తి సాగులో రైతులకు ఏడీఏ శంకర్‌రాథోడ్ సూచనలు ఇచ్చారు. రుద్రారంలో పత్తి పంటలను పరిశీలించారు. మొక్కజొన్న, పత్తి పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పత్తి మొక్కలు పసుపుగా మారితే 10 గ్రాముల పోటాషియం నైట్రేట్ లేదా 19.19.19 లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. కా ర్యక్రమంలో ఏఈవోలు శ్రీపతిరెడ్డి,ఇసాక్, దేవేందర్, రాజురాథోడ్, పావని, వసీం పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: పత్తి, మొక్కజొన్న చేలల్లో నీరు బయటకుపోయేలా రైతులు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహన్‌రెడ్డి తెలిపారు. కొడంగల్ ఏడీఏ శంకర్‌రాథోడ్‌తో కలసి టేకుల్కోడ్, రుద్రారంలో పత్తి పొలాలను పరిశీలించారు. మెట్ట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే ప్రతీ ఎకరానికి 25కిలోల యూరియా, 10కిలోల పొటాష్ ఎరువులను మొక్కలకు ఐదు సెంటీమీటర్ల దూరంలో వేసుకోవాలన్నారు. వేరుకుళ్ల నివారణకు మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా ఒక గ్రాము కార్బండజిమ్ లీటర్ నీటిలో కలిపి మొక్క ల పాదుల చుట్టూ వారంలో రెండుసార్లు పోయాలన్నారు. వర్షాలు తగ్గిన వెంటనే మొక్కజొన్నకు ఎకరాకు 20నుంచి 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేయాలన్నారు.


కొడంగల్ రూరల్: టేకుల్కోడ్‌లో పత్తి పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

కత్తెర పురుగు సమస్య ఉంటే క్లోరంట్రానిలిప్రోల్ 0.4 మి.లీ, లేదా స్పైనటోరం 0.5మి.లీ కలిపి ఆకులపై పిచికారి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓలు శ్రీపతిరెడ్డి, ఇస్సాక్, దేవేందర్, రాజు రాథోడ్, పావని, వసీం, రైతులు తదితరులు ఉన్నారు.

పూడూరు: పొలాల్లో నిలిచిన నీటిని తీసేయాలని ఏవో సూచించారు. వర్షానికి పాడైన పొలాలను సందర్శించారు. పొలాల్లో రైతులు మందులు పిచికారి చేయడం తాత్కాలికం నిలిపివేయాలన్నారు. ముంపునకు గురైన పంటలు త్వరగా బాగవ్వాలంటే 19:19:19 లేదా 13-0-45 లేదా 10 గ్రాముల యూరియా లీటరు నీటిలో కలిపి వారంలో రెండుసార్లు పిచికారి చేయాలన్నారు. పిండినల్లి నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా రెండు మిల్లీ లీటర్ల ఫిప్రోనిల్ మందు లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. ఆకు మచ్చ తెగులు నివారణకు 2.5 గ్రాముల కార్బండిజమ్, మ్యాంకోజెబ్ మందును లీటరు నీటిలో కలిపి మొక్కల పాదుల స్ప్రే చేయాలని సూచించారు.


దారూరు: కొండాపూర్ కలాన్‌లో పత్తిపంటను పరిశీలిస్తున్న ఏడీఏ

క్రైం కార్నర్

రెండు బైక్‌లు ఢీ.. మహిళ మృతి


మృతిచెందిన లావణ్య

పూడూరు, సెప్టెంబర్ 1 : అతివేగంగా వచ్చిన బైకు మరో బైకును ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా బుధేరాకు చెందిన మన్నె రాంచంద్రయ్య కూతురు లావణ్య(33), అల్లుడు కావలి వెంకటేశ బైక్‌పై వెళుతున్నారు. వారు పూడూరు గేటు వద్దకు రాగానే ఓ వ్యక్తి తన బైక్(టీఎస్07 ఈపీ3069) అతివేగం, అజాగ్రత్తగా నడుపుతూ వచ్చి లావణ్య ప్రయాణిస్తున్న బైక్‌కు ఢీకొట్టాడు. బైక్‌పై ఉన్న లావణ్య, ఆమె భర్త వెంకటేశం కిందపడిపోయారు. తలకు గాయమై లావణ్య అక్కడికక్కడే మృతిచెందగా, వెంకటేశాన్ని ఆసుపత్రికి తరలించారు.

నీటి గుంతలో పడి వృద్ధుడి మృతి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 4: నీటి గుంతలో పడి వృద్ధుడు మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతన్‌కల్‌కు శివార్లలోని నీటి గుంటలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తి శవం ఉందని స్థానికులు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికతీశారు. మృతుడు శ్రీరంగవరం గ్రామానికి చెందిన జనార్ధన్‌రెడ్డి(70)దిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నగరంలోని గాంధీ ఆసుపత్రికి తరలించి, కుంటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

అర్ధరాత్రి దొంగతనానికి వచ్చాడనే అనుమానంతో..

వ్యక్తిని చితకబాదిన తండా వాసులు


తండాకు వచ్చిన అనుమానిత వ్యక్తి

బషీరాబాద్, సెప్టెంబరు 4: ఓ గుర్తుతెలియని వ్యక్తి అర్ధరాత్రి తండాలో తిరుగుతుండగా దొంగ అని అనుమానంతో యువకులు చితకబాదారు. అనంతరం పోలీసులకు పట్టించారు. ఈ సంఘటన నంద్యానాయక్ తండాలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నంద్యానాయక్‌తండాలో అర్ధరాత్రి ఓ వ్యక్తి కనిపించాడు. యువకులు అతడిని ఆరా తీయగా పొంతనలేని సమాధానం చెప్పాడు. దొంగగా అనుమానించి ఆ వ్యక్తిని యువకులు చితకబాదారు. తండా వాసులు పోలీసులకు సమాచారమిచ్చి అతడిని పట్టించారు. పోలీసులు అతడిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు. అతడు రాజస్థాన్‌కు చెందిన వాడిగా గుర్తించారు. అతడికి మతిస్థిమితం లేనట్లు తేలింది. స్థానికంగా స్వీట్ దుకాణం నడిపే రాజస్థాన్ వ్యక్తిని పిలిపించి మాట్లాడించారు. అతడు ఓ ఫోన్‌నంబర్ చెప్పగా కుటుంబీకులతో స్వీట్‌షాపు వ్యక్తి మాట్లాడాడు. అతడికి మతిస్థిమితం లేదని కుటుంబీకులు చెప్పినట్లు పోలీసులకు తెలిపాడు. దీంతో సదరు వ్యక్తిని తహసీల్దార్ కార్యాలయం అధికారి వద్ద బైండోవర్ చేసినట్లు ఎస్ఐ గఫార్ తెలిపారు.

రూ.95.75లక్షల విలువైన గంజాయి స్వాధీనం

పేట్‌బషీరాబాద్, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తున్న నలుగురు సభ్యుల ముఠాను బాలానగర్ ఎస్‌వోటి, శామీర్‌పేట్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.95.75లక్షల విలువైన 243కిలోల గంజాయి, 7మొబైల్ ఫోన్లు, బొలెరో వాహనం స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి పేట్‌బషీర్‌బాద్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వివరాలు వెల్లడించారు. హర్యానాకు చెందిన భజరంగ్(23) ఇతను స్టేట్‌కార్ప్‌ప్యాకర్స్ అండ్ మూవర్స్ వ్యాపారం చేస్తున్నాడు, రాజ స్థాన్‌కు చెందిన గజేందర్‌సింగ్ అలియాస్‌గజ్(26) మొబైల్ రిపేర్‌షాప్, సెవన్ హిల్స్ ప్యాకర్స్ అండ్ మూవర్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. హర్యానాకు చెందిన నరేష్‌చింగ్లా అలియాస్ నరేష్(40) ఇతను సెకండ్ హ్యాండ్ వాహనాల డీలర్‌గా పనిచేస్తున్నాడు. హర్యానాకు చెందిన కపిల్‌శర్మ(28) ఇంటరోనెట్ వ్యాపారం చేస్తున్నాడు. భజరంగ్‌కు బోయిన్‌పల్లి గంజాయి స్మగ్లర్ బలరాంతో పరిచయం ఉంది. భజరంగ్ గంజాయి కోసం ఒడిశాలోని శామ్యూల్, మహారాష్ట్రలోని రాకేష్‌లను సంప్రదించాడు. జూలైలో హర్యాణాకు 300 కిలోల గంజాయిని వీరంతా కలిసి తరలించారు. మరోసారి గంజాయి రవాణాకు సిద్ధమయ్యారు. నలుగురు ఆగస్టు 28న బొలేరోలో ఒడిషాకు బయలుదేరారు. వర్షాల కారణంగా రెండు రోజులు భద్రాచలంలో ఆగిపోయారు. ఆగస్టు 31న కారులో ఒడిశాలోని కలిమెలకు వెళ్లారు. అక్కడ సుభాష్‌తో కలిసి రూ.243 కిలోల గంజాయి కొన్నారు. బొలెరోలో 48 గంజాయి ప్యాకెట్లను తరలిస్తుండగా బాలానగర్ ఎస్ఓటీ, శామీర్‌పేట పోలీసులు శామీర్‌పేట్ ఓఆర్ఆర్ దిగుతుండగా పట్టుకున్నారని, 243కిలోల గంజాయి, బొలెరో, ఏడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

ఇళ్లు కోల్పోయిన వారికి ఆర్థికసాయం

మోమిన్‌పేట్, సెప్టెంబరు 4: భారీ వర్షాలకు ఇళ్లు కోల్పోయిన బాధితులకు తహసీల్దార్ మనోహచక్రవర్తి చెక్కులు పంపిణీ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల్లో ఇళ్లు కోల్పోయిన 8మందికి రూ.3,200 చొప్పున పంపిణీ చేశారు. ఇంకా ఎవరైనా గ్రామాల్లో ఇళ్లు కోల్పోయిన వారు ఉంటే అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుభాష్‌గౌడ్, ఏజాజ్‌పాష తదితరులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాల్లో డీజేలకు అనుమతిలేదు

ధారూరు, సెప్టెంబరు 4: వినాయక చవితి ఉత్సవాల్లో మండపాల వద్ద, నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదని వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వినాయక చవితి, మిలాద్-ఉన్-నబీ పండుగల నేపథ్యంలో మండల కేంద్రంలో బుధవారం శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండపాల వద్ద చిన్న శబ్దం వచ్చే లౌడ్ స్పీకర్లు, సౌండ్ బాక్సులే పెట్టుకోవాలని, డీజేల శబ్దాలతో అనర్థాలు కలుగుతాయన్నారు. డీజేలు పెడితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా ఉత్సవాలను జరుపుకోవాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ సాజిదాబేగం, ఎంపీడీవో నర్సింలు, సీఐ రామకృష్ణ, ట్రాన్స్‌కో ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మత పెద్దలు పాల్గొన్నారు.

పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలి

మోమిన్‌పేట్: వినాయక చవితి, మిలాద్-ఉన్-నబీ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ నవీన్‌కుమార్ తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో వినాయక ఉత్సవ కమిటీలు, నిర్వాహకులు, రాజకీయ నాయకులు, మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. పోలీసు నిబంధనలను పాటించాలన్నారు. పోలీసుల అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించొద్దన్నారు. కార్యక్రమంలో ఎస్సై అరవింద్, ఎంపీడీవో విజయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, ఆర్ఐ గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల నిర్వహణ బాగుండాలి

తాండూరు రూరల్, సెప్టెంబరు 4: గ్రామాల్లో వన నర్సరీల నిర్వహణ బాగా ఉండాలని ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్నారు. బుధవారం ఉపాధి టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతీ బుధవారం నర్సరీలో ఉన్న మొక్కలకు ఎరువులు వేయాలని ఆదేశించారు. మొక్కల సైజ్‌ను నమోదు చేయాలన్నారు. మండలంలో 33నర్సరీలున్నాయని తెలిపారు. ఈ ఏడాది 82,500 మొక్కలు నాటే లక్ష్యం పూర్తయిందని పేర్కొన్నారు. నాటిన మొక్కల ఎదిగేలా చూడాలన్నారు. మొక్కలు నాటే క్రమంలో నిర్లక్ష్యం చేయొద్దని హెచ్చరించారు.కార్యక్రమంలో ఏపీవో నరోత్తంరెడ్డి, ఈసీ మదుసూదనరెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి


కేజీబీవీలో వంట గదిని పరిశీలిస్తున్న తహసీల్దార్ మునిరొద్దీన్

మర్పల్లి, సెప్టెంబరు 4: విద్యార్థులకు అందించే భోజనం పట్ల నిర్లక్ష్యం చేయొద్దని మర్పల్లి తహసీల్దార్ మునీరుద్దీన్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. రోజూ బాలికలను అందించే భోజనం మెనూ గురించి సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యతలేని భోజనం అందించడంతో అక్కడక్కడా బాలికలు అస్వస్థతకు గురైన సంఘటనలు ఉన్నాయని గుర్తు చేశారు. అలాంటి సంఘటనలు ఇక్కడ జరగకుండా నాణ్యతాయుతమైన భోజనం అందించాలని టీచర్లకు సూచించారు. విద్యలో వెనకబడిన విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధతో బోధించి మెరుగైన ఫలితా లు సాధించేలా కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

అభివృద్ధి పనులు ప్రారంభం

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 4:బొంరాస్‌పేట్ మండలం నాగిరెడ్డిపల్లి నుంచి కొత్తూర్ వరకు రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలు, తండాల అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తోందని తెలిపారు. అభివృద్ధితో పాటు అన్ని వర్గాల అభ్యున్నతి కోసం సీఎం రేవంత్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. నాగిరెడ్డిపల్లి-కొత్తూర్ వరకు రూ.3.1కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణానికి ఆయన పార్టీ నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములు గౌడ్, రాజేశ్‌రెడ్డి, జయకృష్ణ, వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి, అంజిల్‌రెడ్డి, భీమ్‌రెడ్డి, భీంరావు, కిష్టప్ప, మల్లేశ్, ప్రవీణ్‌కుమార్, డాక్యనాయక్, మహిపాల్, శ్రీనివాస్, నర్సిములు, బాలప్ప, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు పాల్గొన్నారు.


రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న తిరుపతిరెడ్డి

ఓటరు జాబితాలో తప్పులను సరి చేయండి


తాండూరు రూరల్: తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న అధికారి తారాసింగ్

తాండూరు రూరల్/దోమ/బషీరాబాద్, సెప్టెంబర్ 4: ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాలో ఉన్న తప్పులను సరిచేయాలని తాండూరు తహసీల్దార్ తారాసింగ్ సూచించారు. బుధవారం కార్యాలయంలో బీఎల్‌వోలు, రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ తారాసింగ్ మాట్లాడుతూ నేటి(బుధవారం) నుంచి బీఎల్‌వోలు గ్రామాల్లో ఇంటింటికి తిరిగి ఓటరు జాబితాల్లో తప్పులను సరిచేయాలని ఆదేశించారు. అక్టోబర్ 29 నుంచి 18ఏళ్లు నిడిన యువతి, యువకులు కొత్తగా ఓటర్లుగా నమోదు చేయించాలని పేర్కొన్నారు. ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు ఉంటే బీఎల్‌వోలకు సహకరించాలని, సలహాలు, సూచనలు ఇవ్వాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులను కోరారు. కార్యక్రమంలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ లలిత, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఓటరు జాబితాను త్వరితగతిన పూర్తి చేయాలని దోమ ఎంపీడీవో మహేశ్ బాబు సూచించారు. కార్యాలయంలో బీఎల్‌వోలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఇంటింటి సర్వేతో జనవరి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారితో ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. ఈనెల 17 వరకు ఓటరు జాబితాలో సవరణలో, కొత్త ఓటర్ల నమోదును బీఎల్‌వోలు గ్రామాల్లో పర్యటించి ఇంటింటి సర్వేతో పూర్తి చేయాలని పేర్కొన్నారు. తహసీల్దార్ పురుషోత్తం, మండల పంచాయతీ అధికారి సోమలింగం, ఏపీవో దస్తయ్య, పంచాయతీ, రెవెన్యూ సి బ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని తాండూరు డీఎల్‌పీవో శంకర్‌నాయక్ సూచించారు. బషీరాబాద్ మండల పరిషత్‌లో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను ఎంపీడీవో యాదయ్యతో కలిసి పరిశీలించారు. సిబ్బంది తో మాట్లడుతూ కుటుంబంలోని ఓటర్లలంతా ఒకే వార్డు, ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేలా జాబితా రూపొందించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒక్కో ఓటు చాలా కీలకమని, తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశి ంచారు. మండలంలో మూడు కొత్త పంచాయతీలు ఏర్పాటు కాబోతున్నందున వార్డుల వారీగా ఓటర్ల జాబితాను తయారు చేయాలన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ విజయలక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీవో బాలరంగాచారి, సీనియర్ అసిస్టెంట్ షేర్‌ఖాన్ తదితరులున్నారు.


దోమ: బీఎల్‌వోల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మహేశ్‌బాబు

పల్లెలకు తరలుతున్న వినాయక ప్రతిమలు


గ్రామాలకు తరలుతున్న గణనాథుని ప్రతిమ

ఘట్‌కేసర్, సెప్టెంబరు4: వినాయక చవితి సమీపిస్తుండంటంతో పట్టణాల నుంచి వినాయక ప్రతిమలను పల్లెలకు తరలిస్తున్నారు. నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో పెద్దఎత్తున వినాయక ప్రతిమలను తయారు చేసి సిద్ధం చేశారు. గతంలో పెద్ద ప్రతిమలు కావాలంటే నగరంలోని దూల్‌పేట్ వంటి ప్రాంతాల్లోనే లభించేవి. కానీ ఉప్పల్, నారపల్లి, ఘట్‌కేసర్ తదితర ప్రాంతాల్లోనూ ఇప్పుడు భారీ ప్రతిమలు అందుబాటులో ఉన్నాయి. దీంతో వినాయక ప్రతిమల తరలింపుతో రోడ్లు రద్దీగా మారుతున్నాయి. ఎత్తు ఎక్కువగా ఉండే భారీ విగ్రహాలను తరలిస్తున్న సమయంలో ఓఆర్‌ఆర్ వంతెనకు తగిలి ప్రతిమలు దెబ్బతింటున్నాయి. దీంతో నిర్వాహకులు ఇబ్బందులు పడుతూ తయారీ దారులతో చర్చించి మరమ్మతుల కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

రుణమాఫీ కాని రైతుల వివరాల సేకరణ

కులకచర్ల, సెప్టెంబరు 4: రుణమాఫీ కాని రైతుల వివరాలతో పాటు ఒకే రేషన్ కార్డు కలిగిన రైతుల వివరాలను సేకరించే కార్యక్రమం మండలంలో కొనసాగుతోంది. బుధవారం రాంరెడ్డిపల్లిలో ఏవో వీరస్వామి, ఏఈవోలు వంశీ, బాబు రైతు కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారు. పట్టాపాసు పుస్తకాలు వేర్వేరుగా ఉండి బ్యాంకు ద్వారా రుణాలు పొందిన రైతులకు ఒకే రేషన్ కార్డు ఉండటం లాంటి కారణాలతో పాటు రేషన్ కార్డులో పేర్లు లేని రైతుల గురించి పూర్తి సమాచారం తెలుసుకుంటున్నామని ఏవో తెలిపారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్

కీసర, సెప్టెంబర్4: అర్హులైన ప్రతీ ఒక్కరికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం అమలు చేయాలని మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. మండల పరిధి ఆయా గ్రామాలకు ప్రభుత్వ పథకమైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం కీసర మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ ఈటల 54 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్, అధికారులు పాల్గొన్నారు.


కీసరలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్

కోట్‌పల్లి మండల పీఆర్టీయూ నూతన కమిటీ ఎన్నిక


మోమిన్‌పేట్: పీఆర్‌టీయూ మండల నూతన కమిటీ

బంట్వారం(కోట్‌పల్లి), సెప్టెంబర్ 4 : కోట్‌పల్లి పీఆర్టీయూ నూతన మండల శాఖ ఎన్నిక బుధవారం మండల పరిధిలోని రాంపూర్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన పీఆర్టీయూ మండల సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కడియాల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి అమర్నాథ్ తెలిపారు. మ ండల అధ్యక్షుడిగా విశ్వేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణగౌడ్, గౌరవ అధ్యక్షులుగా చంద్రశేఖర్, అసోసియేషట్ అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, మహిళా కార్యదర్శిగా మల్లీశ్వరి, మండల కార్యదర్శిగా నవీన్‌లను ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో కోట్‌పల్లి ఎంఈవో చంద్రప్ప, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో డేనియల్, ఎస్ఐ స్రవంతి, టీచర్లు శారద, మొయినుద్దీన్, అరుణ్ కుమార్, ఉదయ్ కిరణ్, వేణుగోపాల్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

మోమిన్‌పేట్ మండల కమిటీ ఎన్నిక

మోమిన్‌పేట్: మోమిన్‌పేట్ మండల పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా అరుణ్‌కుమార్ ఎన్నికైనట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. పీఆర్‌టీయు మండల అధ్యక్షుడిగా అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమేశ్, అసోసియేట్ అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి వీరేశం, మహిళా ఉపాధ్యక్షురాలిగా జ్యోతిని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయు నాయకులు మల్లేశం, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

● **దోమ:** ఊటుపల్లి తండాకు చెందిన వడిత్య రాజుకు చెందిన ఆవు బుధవారం పాముకాటుతో మృతిచెందింది. ఆవు విలువ రూ.లక్ష వరకు ఉంటుందని రైతు వాపోయాడు. ఆవును పాము కరిచిందని పశు వైద్య అధికారులకు తెలిపినా పట్టించుకోలేద న్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఆవు మృతి చెందిందన్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి తనకు నష్టపరిహారం ఇప్పించాలని రాజు కోరాడు.

దోమ: మండలంలోని ఊటుపల్లి తండాను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని తండా వాసులు ఎంపీడీవోకు బుధవారం వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ తండా అభివృద్ధిలో వెనకబాటుకు గురవుతుందని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేస్తే అభివృద్ధికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ గోపాల్, వినోద్, శివ, సురేశ్, రాజేందర్, రాజు, గణేశ్, సంతోష్, శంకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

● **తాండూరు రూరల్:** ఈ నెల 6వ తేదీన పీఆర్టీయూటీజీ తాండూరు మండల శాఖ సర్వసభ్య సమావేశం, 2024-26 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించడం జరుగుతుందని మండల అధ్యక్షులు ఊరడి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల పురుషోత్తంరెడ్డి తెలిపారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని తులసీగార్డెన్ లో సాయంత్రం 5.30గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, ఎల్మకన్నె పీఏసీఎస్ చైర్మన్ ఎస్.రవీందర్‌గౌడ్ హాజరవుతున్నట్లు వారు తెలిపారు. కావున జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు, సమావేశానికి హాజరు కావాలని వారు కోరారు.

● **నవాబు పేట:** ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు సాగు చేసిన పత్తి పంటలు పాడైపోయాయి. మండలంలోని అక్నాపూర్, అత్తాపూర్, పులుమామిడి, ఎల్లకొండ, చింతల్‌పేట్, ముబారక్‌పూర్ గ్రామాల్లో పంటలు నష్టపోయామని రైతులు వాపోయారు. వ్యవసాయ అధికారులు గ్రామాల వారీగా పంటలు నష్టపోయిన వివరాలు సేకరించి పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

● **బొంరాస్‌పేట్:** అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద ప్రజలకు సీఎంఆర్ఎఫ్ సహాయం అండగా ఉంటుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలంలోని మేడిచెట్టు తండాలో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్, రవి, రాజునాయక్, వినోద్‌నాయక్, రమేశ్‌నాయక్ పాల్గొన్నారు.

● **కులకచర్ల:** బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అన్నారు. బండవెల్కిచర్లలో ఇటీవల మృతిచెందిన వెంకటయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేలు సహాయం అందించారు. అదే విధంగా చౌడాపూర్ మండలంలోని మందిపాల్‌లో అనారోగ్యానికి గురైన సాలె పెంటయ్యను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. నాయకులు రాజశేఖర్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

● **వికారాబాద్:** రాబోయే పండుగలు వినాయక చవితి, మిలాద్-ఉన్-నబీల నేపథ్యంలో గురువారం వికారాబాద్‌లోని అంబేడ్కర్ భవనం సమీపంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహిస్తామని వికారాబాద్ సీఐ నాగరాజు తెలిపారు. వినాయక మండపాల నిర్వాహకులు, హిందూ ఉత్సవ కమిటీ పెద్దలు, ముస్లిం మత పెద్దలు, క్రిస్టియన్ కమిటీ పెద్దలతో ఉదయం 11గంటలకు సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, హాజరవుతున్నారని కావున అందరూ సకాలంలో హాజరు కావాలన్నారు.

● **కులకచర్ల:** చౌడాపూర్ మండలంలోని లింగంపల్లి నుంచి పక్కనే ఉన్న చౌదర్‌గూడెం మండలం గాలిగూడెం గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో కల్వర్టుపై ఉన్న మట్టి కొట్టుకుపోయి వేసిన పైపులు తేలాయి. ఈ కల్వర్టు పై నుంచి ద్విచక్రవాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. షాద్‌నగర్ వెళ్లేందుకు ప్రజలకు ఈ మార్గం దగ్గర అవుతుంది. అధికారులు పాడైన కల్వర్టుకు మరమ్మతులు చేయించాలని లింగంపల్లి మాజీ సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్ కోరారు.

● **తాండూరు రూరల్:** తాండూరు మండలం జినుగుర్తి గ్రామానికి చెందిన బుడిగ రామయ్య బుధవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న తాండూరు మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజ్మత్‌అలీ మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట గ్రామస్తులు ఉన్నారు.

రెయిన్ కోట్ల అందజేత

కీసర రూరల్, సెప్టెంబరు 4 : కార్మికుల సంక్షేమానికి కృషిచేస్తున్నామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి, ఎలక్ట్రీషియన్లు, వాటర్‌మెన్‌కు రెయిన్‌కోట్లు, హ్యాండ్‌గ్లౌస్‌లు, రేడియం జాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేందర్ కుమార్, కౌన్సిలర్లు సుర్వి శ్రీనివాస్, పంగ హరిబాబు, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

శామీర్‌పేట సెప్టెంబరు 4 : శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూరల మల్లారెడ్డి పాల్గొన్నారు. 186మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రశేఖర్‌యాదవ్, అధికారులు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి పూజలు


లక్ష్మీనారాయణ చెరువు అలుగు వద్ద పూజలు చేస్తున్న మత్స్య సహకార సంఘం నాయకులు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 4 : ఇటీవల కురుస్తున్న భారీవర్షాలకు మండలంలోని ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు అలుగు పారింది. మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో గంగపుత్రులు బుధవారం గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. యేటా చెరువు అలుగు పారడంతో గంగమ్మకు ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీ. మత్స్యకారులు కొబ్బరికాయలు సమర్పించి గంగమ్మకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎదులాబాద్ మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పూస యాదగిరి, కార్యదర్శి పూస నర్సింగ్‌రావు, మెంగ రాజు, పూస శ్రీనివాస్, మెంగ బాలకృష్ణ, బాల్‌నర్సింహ్మా, వెంకటేష్, నర్సింగ్‌రావు,యాదగిరి, శ్రీనివాస్, భిక్షపతి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

వికారాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. ధారూరు సీఐ రామకృష్ణ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశంలను ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశించారు. డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్‌గా ఆంజనేయులు, ధారూరు సీఐగా భీంకుమార్‌లను నియమించారు.